క్లుప్తంగా

నేడు గడప గడపకు మనప్రభుత్వం

చింతలనర్వ(గంపలగూడెం): గంపలగూడెం -1 సచివాలయం పరిధిలో సోమ, మంగళవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. కాగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పట్టణశాఖ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు కోరారు.

అనురాగం, ఆప్యాయతకు మరో పేరు అమ్మ

మైలవరం: సృష్టికి మూలం అమ్మ, అంతులేని అనురాగాలకు, ఆప్యాయతకు మరో పేరు అమ్మ, అమ్మ ఎవరికైనా ప్రత్యక్ష దైవమే. అమ్మ ప్రేమ అనిర్వచనీయం, అమ్మకు వందనం అని అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. మాతృ దినోత్సం సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నియోజకవర్గ ప్రజలకు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు.

నేడు 'స్పందన'

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ప్రజా సమస్యలపై అర్జీలు పెట్టుకుంటే వాటిని అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను స్పందనలో అందజేస్తే వాటిని గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందజేత



మైలవరం: మైలవరంలో 35 మంది ముస్లిం పిల్లలకు ఆదివారం ఒడుగులు చేశారు. ప్రతి ఏడాది జరిగే ఒడుగుల కార్యక్రమం ఈ ఏడాది మైలవరం కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సుభానీ సహకారంతో జరిగింది. ఈ సందర్భంగా షేక్ సుభాని చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు షేక్ కరీమ్, వెల్వడం గ్రామ మాజీ అధ్యక్షుడు యరమల రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



మేడూరు(గంపలగూడెం): మేడూరులో ఆదివారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన కోట ముత్తయ్య ఇల్లు ఘటనలో కాలిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు ఎగిసిపడ్డాయి. ఇంట్లో నగదు, బంగారం, సామాన్లు కాలిపోయాయి. బాధితుల కథనం ప్రకారం రూ. 7లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. అందిన సమాచారం మేరకు తిరువూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ఇంటి నుంచి నిప్పు రవ్వలు ఎగిసి పడి ఎదురుగా ఉన్న ముత్తయ్య కుమారులు ఇసాక్ ఇంటి వసారా కాలింది. ఘటనపై వీఆర్వో మూర్తి తహసీల్దార్ కార్యాలయంలో నివేదిక ఇచ్చారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర



చాట్రాయి: మండలంలోని చీపురుగూడెం శివారు మర్రిబంధం గ్రామంలో నాయక పోడుల కులదైవం పెద్దమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మేళతాళాలతో అమ్మవారి ప్రతిమను పూజారి తలపై పెట్టుకుని గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి సంప్రదాయకంగా పూజలు నిర్వహించారు.



నూజివీడులో హనుమాన్ శోభాయాత్ర



మేడూరు వీరాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



మైలవరంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



తిరువూరు కోదండ రామాలయంలో వెండి తమలపాకుల హారం వితరణ

జయ హనుమాన జ్ఞాన గుణ సాగర!

తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతిని ఆదివారం వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో హనుమాన చాలీసా పఠించారు. 'జయ హనుమాన్ జ్ఞాన గుణ సాగర.. జయ కపీశతుహు లోక ఉజాగర.. జై శ్రీరామ్' .. అంటూ భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా హనుమజ్జయంతి

మేడూరు(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో విశిష్ట ఆలయమైన గంపలగూడెం మండలం మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజతో మూడో రోజు హనుమజ్జయంతి ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కోమందూరి రామచంద్రాచార్యులు ప్రారంభించారు. అనంతరం పంచామృతాలు, నవఫల రసాలు, 108 కలశ బిందెల జలంతో స్వామికి కనులవిందుగా అభిషేకం జరిపారు. తమలపాకులు, సింధూరంతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా, తెలంగాణా రాష్ట్రం ఉమ్మడి ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానంలో నాలుగు వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామృష్ణ, పాలకవర్గ సభ్యులు, ఈఓ జన్ను వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చైశారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. చాట్రాయి–పోలవరం గ్రామాల మధ్య ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం, సూరంపాలెం, చనుబండ, సి.గుడిపాడు, కోటపాడు, మర్లపాలెం, ఆరుగొలనుపేట గ్రామాల్లో భక్తులు వేలాది మంది పాల్గొని స్వామికి పూజలు చేశారు.

ముసునూరులో..

ముసునూరు: ఆంజనేయస్వామి జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ముసునూరు సిల్క్‌నగర్, చెక్కపల్లి, లోపూడి, గోపవరం, కాట్రేనిపాడు, వేల్పుచర్ల తదితర గ్రామాలలో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వేలాదిగా హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాశీర్వచనాలు స్వీకరించారు.



గంపలగూడెంలో జైహనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం

జైహనుమాన్ శోభాయాత్ర

గంపలగూడెం: హనుమజ్జయంతి సందర్భంగా హిందూ సంఘాలు, వీరాంజనేయస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో ఆదివారం గంపలగూడెంలో జైహనుమాన్ శోభాయాత్ర భారీగా నిర్వహించారు. గంపలగూడెం రామాలయం వద్ద నుంచి ప్రారంభమైన శోభాయాత్ర తోటమూల మీదుగా మేడూరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. ఐదు కిలోమీటర్ల దూరం సాగిన శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో జైహనుమాన్, జైశ్రీరామ్ అంటూ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. కాకర్ల, లక్ష్మీపురం, మల్లేల, ముష్టికుంట్ల, గానుగపాడు, చౌటపల్లి, మునుకుళ్ల, అక్కపాలెం, కోకిలంపాడు తదితర గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

తిరువూరులో..

తిరువూరు: హనుమజ్జయంతి సందర్భంగా తిరువూరులోని పలు దేవాలయాల్లో ఆదివారం విశేషపూజలు జరిగాయి. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతాలతో, పాలతో 45 అడుగుల ఆంజనేయ స్వామిని అభిషేకించారు. రాజుపేట, చీరాల సెంటర్, జగన్నాథపురం కాలనీలలోని ఆంజనేయస్వామి ఆలయాలలో 108 కలశాలతో పళ్లరసాలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శ్రీకోదండరామాలయం, పాతతిరువూరు రామాలయం, సోముకుంట ఆంజనేయస్వామి దేవస్థానాలలో కూడా హనుమజ్జయంతి ఉత్సవాలను నిర్వహించారు. శ్రీకోదండరామాలయంలో ఆంజనేయస్వామి విగ్రహానికి న్యాయవాది నాగుబండి రామకృష్ణ 21 వెండి తమలపాకులతో హారం బహూకరించారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలోని ప్రజలు హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో ఆదివారం జరుపుకున్నారు. ఆగిరిపల్లిలోని శోభనాచలస్వామి ఆలయంలోని యోగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్థానిక రామకృష్ణ భజన మందిరంలో ఆంజనేయస్వామికి విశేష పూజలను జరిపించారు. నెక్కలం అడ్డరోడ్డు అభయాంజనేయస్వామి ఆలయంలో, వట్టిగుడిపాడు సెంటర్ రామాలయంలో, వడ్లమానులో, ఈదులగూడెంలో, చొప్పరమెట్లలో ఆంజనేయస్వామికి భక్తులు పూజలు నిర్వహించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి భక్తులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.

మైలవరంలో..

మైలవరం: ఆంజనేయస్వామి జయంతి కార్యక్రమం మైలవరంలో ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. మైలవరం రామకృష్ణ కాలనీలోని భక్త ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా ఆలయంలో 516 సార్లు హనుమాన్ చాలీసా పఠనం చేసి, పూజలు నిర్వహించారు.



చాట్రాయిలో పూజలందుకున్న ఆంజనేయస్వామి

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: హనుమజ్జయంతి వేడుకలు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గర్భాలయాల్లో కొలువు దీరిన ఆంజనేయస్వామిని వివిధ రకాల పూలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక దాసాంజనేయ స్వామి ఆలయం, కాచవరం ఆంజనేయస్వామి ఆలయాల్లో తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, సింధూర నాగవల్లి సహస్రనామ అర్చన జరిపారు.

నూజివీడు: పట్టణంలోని మైలవరం రోడ్డులో ఉన్న కోదండ రామాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన శోభాయాత్ర బైక్‌ర్యాలీ సబ్‌కలెక్టర్ కార్యాలయం, శ్రీనివాస సెంటర్, పెద్దగాంధీబొమ్మ సెంటర్, చిన్నగాంధీ బొమ్మ నుంచి తుక్కులూరు అడవి ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. ఆ తరువాత ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సదస్సును నిర్వహించారు.



ఇబ్రహీంపట్నం దాసాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు



విస్సన్నపేటలో శోభాయాత్ర



ముసునూరు సిల్క్‌నగర్‌లో పూజలందుకున్న స్వామి



తిరువూరు మండలం కాకర్లలో హనుమజ్జయంతి



వట్టిగుడిపాడు సెంటర్ రామాయలంలో ఆంజనేయస్వామికి తమల పత్రార్చనలో భక్తులు

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను 104 ఎంఎంయూ (మొబైల్ మెడికల్ యూనిట్) సిబ్బంది ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. 104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, 104 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని, కాంట్రాక్ట్ బేసిక్‌తో పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని, ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని మంత్రి జోగి రమేష్ తెలిపారు. ఆ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సందీప్‌కుమార్, సభ్యులు కిరణ్‌కుమార్, అప్పారావు పాల్గొన్నారు.



మంత్రి జోగి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న 104 వాహన సిబ్బంది

రహదారి అభివృద్ధితో ప్రజల హర్షం



నాడు సీతారామపురంలో నూజివీడు–విజయవాడ రహదారి



నేడు అభివృద్ధి జరిగిన తరువాత నూజివీడు–విజయవాడ రహదారి

ఆగిరిపల్లి: మండలంలోని సీతారామపురంలో గుంతలమయంగా ఉండే ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధి చేయడంతో గ్రామస్తులు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నుంచి రామాలయం వరకు గల విజయవాడ–నూజివీడు రోడ్డు వర్షాలకు ధ్వంసం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నేడు రహదారిపై సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగిన తరువాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని శభాష్ అంటున్నారు. రహదారి సమస్యపై గ్రామ సర్పంచ్ అత్తి మురళీ మోహనరావు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో 220 మీటర్లు సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసి మరో 30 ఏళ్ల వరకు రహదారి మరమ్మతులకు గురికాకుండా సీతారామపురంలో విజయవాడ–నూజివీడు రహదారికి శాశ్వత పరిష్కారం చూపించారు.

సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

సీతారామపురంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి హయాంలో నూజివీడు–విజయవాడ రహదారి నిర్మాణం చేశారు. మళ్లీ 21 సంవత్సరాల తరువాత ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అందరూ మెచ్చుకునే విధంగా రహదారి నిర్మాణం చేపట్టాం. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ప్రతాప్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

– అత్తి మురళీమోహనరావు, సర్పంచ్, సీతారామపురం, ఆగిరిపల్లి మండలం

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): హైదరాబాద్‌కు చెందిన శ్రీదేవి సంగీత నృత్యనికేతన్‌కు చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన సాగింది. 14 మంది నృత్యకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.



హైదరాబాద్‌కు బస్ పునరుద్ధరణ

మైలవరం: మైలవరం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్‌ను తిరిగి పునరుద్ధరించారు. గతంలో మైలవరం నుంచి హైదరాబాద్‌కు నేరుగా బస్ సౌకర్యం ఉండేది. కరోనా అప్పటి నుంచి ఈ బస్ సర్వీస్‌ను నిలిపి వేశారు. గత కొద్ది రోజులుగా స్థానికులు హైదరాబాద్‌కు బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరడంతో వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అధికారులకు తెలియజేయడంతో హైదరాబాద్‌కు బస్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం నుంచి బస్ రాత్రి 8.30 గంటలకు మైలవరం వచ్చి, ఇక్కడి నుంచి రాత్రి 9గంటలకు హైదరాబాద్ బయలు దేరి వెళుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

కొలతలు ఎంతో ఉపయోగకరం

మైలవరం: ఆధునిక సమాజంలో రాశులు, కొలతలు ప్రమాణాలు ఎంతో ఉపయోగకరమైనవని చిలుకూరివారిగూడెం భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు డీ.వీ.ఎస్. ప్రసాద్ తెలిపారు. మారుతున్న సమాజాన్ని అనుసరించి మనుషులు మారాలని, గతంలో సమాజంలో వస్తు మార్పిడి ద్వారా వ్యాపారం జరిగేదని, ప్రస్తుతం కొలతలు, రాశుల ద్వారా వ్యాపారం జరుగుతుందన్నారు. ఆదివారం మైలవరం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన రాశులు, కొలతలు ప్రమాణాలు గురించి విద్యార్థులకు బోధించారు.

మామిడికి మసి తెగులు

- ప్రతి కూల వాతావరణంతో తెగుళ్ల వ్యాప్తి
- మార్కెట్‌లో పడిపోయిన ధరలు



మామిడి కాయలకు ఏర్పడిన మసి తెగులు

ఆగిరిపల్లి: పండ్లలో రారాజు మామిడికి ఈ ఏడాది మసి తెగులు దాపురించింది. అకాల వర్షాల వల్ల మామిడికి మసి, మంగు తెగులు సోకడంతో రైతు ఈ ఏడాది ధరలు లేక డీలాపడ్డాడు. మండలంలో 25 వేల ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది అనుకున్న సమయం కన్నా ఆలస్యంగా వచ్చిన మామిడి పూత నిలిచి కాయలు కాశాయి. ఆ సంతోషం రైతులకు ఎక్కువ రోజులు లేకుండా చేశాయి అకాల వర్షాలు. మామిడి కాయ తొడిమి వద్ద నల్లగా మసి ఏర్పడి మామిడి నాణ్యత లోపించి రైతును నట్టేట ముంచాయి. దీంతో మార్కెట్‌లో ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురవక ముందు రూ.35 వేలు పలికిన బంగినపల్లి మామిడి, వర్షాల తరువాత రూ.15 వేలకు, శనివారం రూ.7 వేలకు పడిపోవడంతో రైతులు దిగాలు చెందారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి మామిడిని సాగు చేశామని అకాల వర్షాలు, మసి, మంగు తెగులు కుంగదీస్తున్నాయని రైతులు వాపోయారు. తోతాపురి మామిడి కాయల ధర మెరుగ్గా ఉంది. ఆలస్యంగా వచ్చిన మామిడి పూత వల్ల ఈ ఏడాది జూన్ నెలాఖరు వరకు మామిడి సీజన్ ఉంటుందని అనుకున్నారు. వర్షాలతో మే నెలాఖరుతో మామిడి సీజన్ ముగిసే అవకాశం ఉంది. మసి తెగులు వల్ల చిన్న రసాలను కావు వేసి విక్రయించే గంప వ్యాపారులు ఈ ఏడాది పూర్తిగా దెబ్బతిన్నారు. వర్షాల వల్ల మామిడి కాయల్లోకి పురుగు రావడంతో రైతులు కాయలను కోయకుండా చెట్లనే వదిలివేసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

గ్రంథాలయంలో మాతృదినోత్సవం

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో ఆదివారం అంతర్జాతీయ మాతృదినోత్సవం నిర్వహించారు. తల్లిదండ్రులను గౌరవించాలని, తల్లికి ఉన్న ప్రాధాన్యతను పిల్లలు తెలుసుకోవాలని గంపలగూడెం తహసీల్దారు బాలకృష్ణారెడ్డి సూచించారు. తెలుగుభాషా వికాససమితి కన్వీనర్ తోట ఉమామహేశ్వరరావు, గ్రంథాలయాధికారిణి పద్మావతి, ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాంప్రదీప్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని భరతకుమారి పాల్గొన్నారు.

పోయినవి

లటికే లక్ష్మీ సూర్య ప్రశాంతి W/o. సంపత్ కుమార్, D.No. 24-246/2/A, ఎంప్లాయీస్ కాలనీ, నూజివీడు (పట్టణం & మండలం), ఏలూరు జిల్లా వారికి చెందిన రీ సర్వే నెంబరు. 628/1, ఒరిజినల్ దస్తావేజు నెం. 8515/2014 ఇంటి వద్ద నుండి నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌కు ఫోటోస్టాట్ తీయించడానికి వెలుతుండగా మార్గం మధ్యలో పోయినవి. దొరికిన వారు పై అడ్రస్సును సంప్రదించగలరు.

శుభ కార్యక్రమానికి ప్రముఖులు



పుల్రేలలో శుభకార్యక్రమానికి హాజరైన ఏలూరు ఎంపీ శ్రీధర్,ఎమ్మెల్యేలు రక్షణనిధి,వెంకట్రావు

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామంలో మారెమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్ బాబు నివాసంలో ఆయన కుమారుడు భరత్ నిశ్చితార్థ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆదివారం హాజరయ్యారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, రాష్ట్ర కో–ఆపరేటీవ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.